సాక్షి
నిర్మల్
శనివారం । 27 । జనవరి । 2024



త్రివర్ణ పతాకంతో విద్యార్థిని



గణతంత్ర వేడుకల్లో పరేడ్ నిర్వహిస్తున్న పోలీసులు



భరతనాట్యంతో ఆకట్టుకున్న చిన్నారి

అందరికీ సంక్షేమం



జెండా ఎగురవేసి వందనం చేస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



త్రివర్ణ పతాకం చేతబూని నృత్యం చేస్తున్న మల్లాపూర్ పాఠశాల విద్యార్థులు

- ప్రజల వద్దకే పాలన
- సమష్టిగా జిల్లా అభివృద్ధి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ఘనంగా గణతంత్ర వేడుకలు
- జాతీయ జెండా ఎగురవేసిన కలెక్టర్
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే



గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే..

నిర్మల్: ప్రజలందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ.. సమష్టిగా జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శుక్రవారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎస్పీ జానకీ షర్మిల, అడిషనల్ కలెక్టర్లు కిశోర్‌కుమార్, ఫైజాన్‌అహ్మద్, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. కలెక్టర్ జాతీయ పతాకం ఎగురవేశారు. తర్వాత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. ముందుగా జిల్లా ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బ్రిటీష్‌కాలం నాటి భారత ప్రభుత్వ చట్టం 1935ని రద్దు చేస్తూ 1950, జనవరి 26న మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చిందన్నారు. భారతదేశం సర్వ సత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా అవతరించిందన్నారు. ప్రజలందరూ సంపూర్ణ స్వేచ్ఛను, సమానత్వాన్ని పూర్తి స్థాయిలో పొందారని గుర్తు చేశారు.

అభివృద్ధి.. సంక్షేమం..

జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు లక్ష్యంగా పనిచేస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా ప్రగతిని ప్రస్తావించారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించాలనే తపనతో తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఆరు గ్యారంటీల అమలుకు హామీ ఇచ్చి, ఇప్పటికే రెండు గ్యారంటీలు నెరవేర్చిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలకు చేరువగా ప్రజాపాలన అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చిందని తెలిపారు. ప్రజాసమస్యలు పరిష్కరించడం కోసమే ప్రజాపాలన కార్యక్రమం ఏర్పాటు చేసిందన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల వారీగా గత డిసెంబర్ 28 నుంచి ఈనెల 6 వరకు గ్రామసభలు నిర్వహించామన్నారు. జిల్లాలో మొత్తం 2,46,402 దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలోనూ మహాలక్ష్మి పథకం కింద 9.66 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకం కింద వివిధ రకాల వ్యాధులకు జీవితకాలం మందులు అందిస్తున్నామన్నారు. ఈసందర్భంగా చిన్నారుల చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కలెక్టర్‌తో పాటు ఇతర అతిథులు, జిల్లా ఉన్నతాధికారులు చిన్నారులను అభినందించారు. అనంతరం శాఖల వారీగా శకటాల ప్రదర్శనను తిలకించారు. అన్ని శాఖల్లో ప్రతిభచాటిన అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందించారు. అంతకుముందు కలెక్టరేట్‌లో, కలెక్టర్‌క్యాంప్ కార్యాలయాల్లోనూ కలెక్టర్ సంగ్వాన్ పతాకావిష్కరణ చేశారు. ఆయా కార్యక్రమాలలో ఆర్డీవోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంబురం.. సాంస్కృతికం

- ఆకట్టుకున్న పోలీస్ పరేడ్
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- వేడుకల్లో శకటాల ప్రదర్శన

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో భాగంగా నిర్వహించిన వివిధ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వేడుకల్లో భాగంగా పోలీసులు నిర్వహించిన పరేడ్ సందర్శకులను ఆకట్టుకుంది. క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్, బాంబు స్క్వాడ్, సైబర్ క్రైం, స్పెషల్ ఫోర్స్, సీఈఐఆర్ టీమ్‌లు పరేడ్ నిర్వహించారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ జానకి షర్మిల, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జాతీయ పతాకం ఆవిష్కరణ తర్వాత వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

శకటాల ప్రదర్శ..

వేడుకల్లో డీఆర్డీవో, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన శకటం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను గురించి ప్రదర్శించారు. మన ఊరు మన బడి శకటం విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపడుతున్న పాఠశాలల అభివృద్ధిని తెలియజేశారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటం స్వ యం సహాయక సంఘాలు పొందుతున్న పథకా లను వివరించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 108, 102, 1962 వాహనాల ద్వారా జిల్లా ప్రజలకు అందుతున్న సేవలను వివరించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చే సిన శకటం ద్వారా రైతుకు అందుతున్న సేవలను తెలియజేశారు. పోలీసు శాఖ శకటంలో షీటీం, డాగ్ స్క్వాడ్, సైబర్ నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ సంబంధించినవి వివరించారు.

ప్రత్యేక స్టాళ్లు

జిల్లా గ్రామీణాభివృద్ధి, పట్టు పరిశ్రమలు, వ్యవసాయ, అటవీ, కొయ్య బొమ్మలు, మిషన్ భగీరథ, వైద్య, ఆరోగ్య, జిల్లా సంక్షేమ, మత్స్య శాఖ, విజయడెయిరీ, చౌకధరల దుకాణం, పశు సంవర్ధక శాఖల స్టాళ్లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా అందుతున్న సేవలను వివరించారు.



ఆకట్టుకున్న పోలీసు శకటం



ఓటర్ అవగాహన శకటం



ఆరు గ్యారంటీల శకటం





వేడుకలను తిలకిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్, భైంసా ఏఎస్పీ, నిర్మల్ డీఎస్పీ, జిల్లా అధికారులు..



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్



సీతారాముల వేషధారణలో చిన్నారులు



నృత్యం చేస్తున్న కేజీబీవీ పాఠశాల విద్యార్థులు



కరాటే ప్రదర్శిస్తున్న విద్యార్థులు

న్యూస్‌రీల్

జిల్లా కోర్టులో రిపబ్లిక్‌డే వేడుకలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా జడ్జి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన న్యాయస్థానంలో 75వ రిపబ్లిక్‌డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బ్యాడ్మింటన్‌లో ఖానాపూర్ న్యాయవాది ప్రతిభ



బహుమతి అందుకుంటున్న నరేంద్రనాథ్

ఖానాపూర్: జిల్లా కేంద్రంలో నిర్మల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో ఖానాపూర్ పట్టణానికి చెందిన యువ న్యాయవాది గాంధారి నరేంద్రనాథ్ ఖానాపూర్ బార్ అసోషియేషన్ తరపున మొదటి బహుమతి సాధించాడు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో కోర్టు భవనంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు.

మళ్లీ 'మొగి'

- వరి రైతును వెంటాడుతున్న తెగులు
- వందల ఎకరాల్లో పంటలకు నష్టం
- ఎన్ని మందులు పిచికారీ చేసినా కానరాని ఫలితం
- పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారులు
- ఆందోళనలో అన్నదాతలు



ధర్మోరలో తెగులు సోకిన వరి పంటకు రసాయన మందు పిచికారీ చేస్తున్న రైతు

లోకేశ్వరం: భారీ వర్షాలతో వానాకాలం వరిపంట అన్నదాతకు నష్టాలే మిగిల్చింది. ఎన్నో ఆశలతో యాసంగి సాగు ప్రారంభించిన రైతులకు ఆదిలోనే తెగుళ్ల బెడద మొదలైంది. గత యాసంగిలో సోకినట్లుగానే ఈ యాసంగిలోనూ వరి పంటలను మొగి పురుగు ఆశిస్తోంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా పంట కోలుకోకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మరోవైపు పురుగు మందులకు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అయినా వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించడం లేదు.

95 వేల ఎకరాల్లో సాగు..

ఈఏడాదిలో జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 95 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా వరిని మొగి పురుగు ఆశించి వందల ఎకరాల్లో పంటను నాశనం చేస్తోంది. తెగులు ఉధృతికి నాట్లు వేసిన పొలాలన్నీ ఎర్రబడుతున్నాయి. పిలికలు రావడం లేదు. డిసెంబర్‌లో నాట్లు వేసిన పొలాల్లో మొగిపురుగు ఉధృతి ఎక్కువగా ఉంది. గత యాసంగి, ఈ వానాకాలంలో మొగిపురుగు కారణంగా వరిలో తెల్లకంకి ఏర్పడి దిగుబడి సగానికి తగ్గిపోయింది.


నాట్లు వేసిన పక్షం రోజుల నుంచే..

యాసంగి నాట్లు మొదలై నెల రోజులు దాటింది. నాట్లు వేసిన 15 రోజులకే మొగిపురుగు పంటను ఆశిస్తోంది. తెగులు ఛాయలు కనబడగానే రైతులు అప్రమత్తమవుతున్నారు. రసాయన పురుగుమందులు పిచికారీ చేస్తున్నారు. ఎకరాకు రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. అయినా తెగులు నియంత్రణలోకి రావడం లేదు. దీంతో కొంతమంది రైతులు పంటను తొలగించి కొత్తగా నాట్లు వేస్తున్నారు.

ఏ మందు చెబితే అది పిచికారీ..

జిల్లాలోని అన్ని మండలాల్లో మొగి పురుగు బెడద ఉంది. కొన్ని మండలాల్లో వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించడంలేదు. రైతులకు సూచనలు ఇవ్వడం లేదు. దీంతో రైతులు రసాయన మందుల దుకాణాలకు వెళ్లి వారు ఏది చెబితే అదే కొని తెచ్చి పిచికారీ చేస్తున్నారు. దీంతో పురుగు మందుల దుకాణాల యజమానులకే లబ్ధి కలుగుతోందని రైతులు పేర్కొంటున్నారు. మొగి ఉధృతి మాత్రం తగ్గడం లేదని చెబుతున్నారు.


రెండుసార్లు మందు పిచికారీ..



నాలుగు ఎకరాల్లో వరిసాగు చేస్తున్న. నాటేసిన 15 రోజులకే మొగిపురుగు తగిలింది. ఇప్పటికీ రెండు సార్లు రసాయన మందులు పిచికారీ చేసిన. రూ.10 వేలు ఖర్చయింది. అయినా మొగిపురుగు ఉధృతి తగ్గలేదు.

– ఈరన్న, ధర్మోర రైతు

ఇంత ఉధృతి ఎప్పుడూ లేదు..



గతంలో ఎన్నడూ ఇంత ఉధృతంగా మొగిపురుగు దాడి చేయలేదు. ఎకరంలో వరినాట్లు వేసిన. 15 రోజులకే పంటను ఆశించి వారం రోజుల్లో పొలమంతా విస్తరిస్తోంది. రెండు సార్లు పురుగు మందు కొట్టిన.

– దిమేరి చిన్నసాయారెడ్డి, రాయాపూర్‌కాండ్లీ, రైతు

వాతావరణం అనుకూలించక

వాతావరణంలో తేమ శాతం అధికంగా ఉండడంతో వరికి మొగిపురుగు ఆశిస్తోంది. వరి నాట్లు వేసే సమయంలో నారుమడి(తుకం) కొనల తుంచి నాట్లువేయాలి. నారు కొనల్లో మొగిపురుగు గుడ్లు పెడుతుంది. నాట్లు వేశాక అది పంటకు తగిలి ఉధృతమవుతుంది. నారుమడిలో కొనలు తుంచితే చాలా వరకు అరికట్టవచ్చు. నాటు వేశాక 15–20 రోజుల వ్యవధిలో 3జీ లేదా 10జీ గుళికలు చల్లితే మొగిపురుగు నివారించవచ్చు.

– అంజి ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

సమరయోధుల స్ఫూర్తితో ముందుకు సాగాలి

- ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల



జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: స్వాతంత్య్ర సమరయోధుల పోరాట స్ఫూర్తితో భావితరాలు ముందుకు సాగాలని ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు, పోలీస్ ప్రధాన కార్యాలయంలో 75వ గణతంత్ర దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులకు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బీఆర్.అంబేద్కర్ అతిపెద్ద భారత రాజ్యాంగాన్ని రచించి, భారతదేశానికి దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరూ క్రమబద్ధంగా విధులు నిర్వహించాలని, ఎందరో త్యాగధనుల ఫలితం గణతంత్ర దినోత్సవం అని తెలిపారు. వారిని ఎప్పుడూ మనం స్మరిస్తూ ఉండాలని చెప్పారు. పోలీసులు నిరంతరం శాంతిభద్రతలతోపాటు, ప్రజల ధన, మాన ప్రాణాలను కాపాడటంలో ముందుంటారన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఏఆర్) వెంకటేశ్వర్లు, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ రవీందర్‌రెడ్డి, జిల్లాలోని సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, డీపీవోలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ కళాకారుడికి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న భీమేష్

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లాకు చెందిన వర్ధమాన కవి, యువ కళాకారుడికి 'ఉత్తమ పర్యావర్యవరణ కళాకారుడి' పురస్కారం లభించింది. నిర్మల్ రూరల్ మండలం అనంతపేట్ గ్రామానికి చెందిన పోలీస్ భీమేశ్‌కు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడలో జనసేవ సొసైటీ జాతీయ యూత్ పార్లమెంట్–2024 రెండు తెలుగు రాష్ట్రాల్లోని యువ సామాజిక కార్యకర్తలు కళాకారులకు ఈ ప్రశంసపూర్వక పురస్కారాన్ని ప్రకటించారు. అయితే పోలీస్ భీమేష్ స్వతహాగా సహజంగా లభించే చెరువు బంకమట్టితో విభిన్న రకాల శిల్పాలను మలుస్తూ ఆకట్టుకుంటున్నాడు. సాధారణ బంకమట్టితో ప్రముఖ దేశ నాయకుల విగ్రహాలు, దేవతామూర్తుల ప్రతిమలను జీవకళ ఉట్టిపడే విధంగా తయారు చేస్తున్నాడు. ఇతని ప్రతిభను గుర్తించిన జనసేన సొసైటీ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీస్ భీమేశ్‌కు ఉత్తమ పర్యావరణ కళాకారుడి పురస్కారంప్రదానం చేసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీబీఐ మాజీ జెడీ లక్ష్మీనారాయణ అవార్డు ప్రదానం చేశారు.

బోనమెత్తిన మొగ్లి



బోనాలతో ఆలయం వద్ద భక్తుల సందడి

తానూరు: మండలంలోని మొగ్లి గ్రామంలో మహాలక్ష్మి జాతర శుక్రవారం ప్రారంభమైంది. వేడుకల్లో భాగంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. భేరీ చప్పుళ్లతో గజ్జల లాగులు ధరించి నృత్యాలు చేస్తూ బోనాలతో ఆలయానికి చేరుకున్నారు. దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జేఎల్‌ఎంకు ప్రశంస



అవార్డు అందుకుంటున్న జేఎల్‌ఎం నర్సయ్య

కడెం: మండలంలోని బెల్లాల్ విద్యుత్ సబ్ స్టేషన్ జూనియర్ లైన్‌మెన్ నర్సయ్య ఉత్తమ సేవలకు గుర్తింపు దక్కింది. ఇటీవలే బెల్లాల్ సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అయ్యో లైన్ తెగిపోవడంతో ప్రాణాలకు తెగించి చెరువు నీటిలో ఈదుకుంటూ వెళ్లి మరమ్మతులు పూర్తిచేసి సరఫరాను పునరుద్ధరించారు. ఆయన సేవలకు వరంగల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అవార్డు ప్రదానం చేశారు.

ఉద్యమకారులకు గుర్తింపు



కోదండరామ్‌తో తిలక్‌రావు

ఖానాపూర్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన ఉద్యమకారులకు కాంగ్రెస్ పాలనలో గుర్తింపు లభిస్తుందని టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు కె.తిలక్‌రావు అన్నారు. టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరామ్‌కు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని టీజేఎస్ కార్యాలయంలో కోదండరామ్‌ను శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అమరుల ఆశయసాధనలో భాగంగా ప్రతిపక్ష పాత్ర పోషించి నియంతపాలనకు చరమగీతం పాడేందుకు కోదండరామ్ ఎంతో కృషి చేశారన్నారు.

క్లుప్తంగా

అయోధ్యకు సైకిల్‌యాత్ర



సైకిల్ యాత్రికులను సన్మానిస్తున్న దృశ్యం

భైంసా: అయోధ్యలో శ్రీరాములోరి దర్శనానికి సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను భైంసా పట్టణవాసులు సన్మానించారు. జహీరాబాద్‌కు చెందిన సిద్దేశ్ గురువారం సైకిల్‌పై బయలు దేరి భైంసా చేరుకున్నాడు. సిద్దేశ్ స్నేహితుడైన రాజు సైకిల్‌యాత్రతో అయోధ్యకు వెళ్తున్నాడు. కుభీర్ మండలం అంతర్ని గ్రామానికి చెందిన రాజు భైంసాకు చేరుకున్నాడు. సైకిల్‌పై అయోధ్యకు వెళ్తున్న ఇద్దరు యువకులను భైంసా పట్టణ వాసులు సన్మానించారు. పులేనగర్‌లోని హనుమాన్ మందిరంలో ఘనంగా స్వాగతించారు. సైకిల్‌యాత్రతో వెళ్తున్న ఇద్దరు యువకులకు భైంసా పట్టణానికి చెందిన పలువురు యువకులు శాలువాలతో సత్కరించారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు మృతి

పెంబి: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రైతు చికిత్స పొందుతూ శుక్రవారం పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఎస్సై రజినీకాంత్ వివరాల ప్రకారం.. మండలంలోని తాటిగూడ గ్రామానికి చెందిన గుగ్లావత్ గోవింద్ (42) తనకున్న ఎనిమిది ఎకరాల్లోని వ్యవసాయ భూమిలో ఐదెకరాల్లో పత్తి, మూడెకరాల్లో నీలగిరి పంటను వేశాడు. వర్షాల ప్రభావంతో పత్తి పంట దిగుబడి రాకపోవడంతో పాటు నీలగిరి మొక్కలు చనిపోయాయి. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక బుధవారం 10గంటల సమయంలో పత్తి చేనులో పురుగుల మందు తాగాడు. తాగిన విషయం ఇంటికి వచ్చి భార్య సునీతకు చెప్పడంతో నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్సై రజినీకాంత్ తెలిపారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తోరణాలపై లొల్లి



కార్యాలయ ఆవరణలో కట్టిన తోరణాలు

ఖానాపూర్: పట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయం ఆవరణలో అశోకచక్రంతో కూడిన త్రివర్ణపతాక తోరణాలను ఏర్పాటు చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. ప్లాస్టిక్ తోరణాలతో పాటు త్రివర్ణ పతాకంపై అశోకచక్రం ఉన్న తోరణాలను ఏర్పాటు చేయవద్దని ఉన్నతాధికారుల ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో తోరణాలు ఏర్పాటు చేయడం వివాదాస్పదమైంది. ఈ విషయమై డీఈఈ సురేందర్‌ను వివరణ కోరగా సిబ్బందికి తెలియక ఏర్పాటుచేశారని, విషయం తెలిసిన వెంటనే వాటిని తొలగించామని వివరణ ఇచ్చారు. ఈ విషయమై డెప్యూటీ తహసీల్దార్ మంజులను వివరణ కోరగా, ప్రతీ ఒక్కరు జాతీయ పతాకాన్ని గౌరవించాలని, అశోక చక్రాలతో ఉన్న తోరణాలు ఆ విధంగా ఏర్పాటుచేయడం చట్టవిరుద్ధమని, అలా ఎవరు ఏర్పాటు చేయవద్దని ఆమె తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

ఎదులాపురం: ఆదిలాబాద్ పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన తోక ఊశన్న (35) కనిపించడం లేదని టూ టౌన్ ఎస్సై జీవీ రమణారెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. తోక ఊశన్న ఈనెల 19న పనికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఇంత వరకు తిరిగి రాకపోవడంతో.. కొడుకును వెతికి పెట్టాలని కోరుతూ ఊశన్న తల్లి తోక లసుందేవి ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్ ఎల్. కిషోర్ కుమార్



వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ
రత్న కళ్యాణి, ఆర్డీవో, నిర్మల్
రవీందర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి
గంగారెడ్డి, డీఎస్పీ, నిర్మల్

ప్రతిభకు పురస్కారాలు

నిర్మల్‌చైన్‌గేట్: 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో ప్రతిభ కనబరిచిన 213 మంది ఉద్యోగులకు పురస్కారాలు దక్కాయి. వారికి గణతంత్ర వేడుకుల సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జెడ్పీ చైర్ పర్సన్ విజయలక్ష్మి, జిల్లా ఎస్పీ జానకి షర్మిల ప్రతిభా పురస్కారాలు అందజేశారు.



ప్రభాకర్ రావు, జిల్లా ట్రెజరీ అధికారి
శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్
సందీప్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మిషన్ భగీరథ
అష్రాఫ్ హైమద్, మార్కెటింగ్‌శాఖ ఏడీ
తిరుమల, డీపీఆర్‌వో
అంబాజీ, గిరిజన అభివృద్ధి అధికారి
హనుమాన్లు, ఎస్సీ కార్పొరేషన్ అధికారి
శ్రీకళ, సివిల్ సప్లై అధికారి
విజయలక్ష్మి, డీఆర్‌డీవో
నదీమ్, జిల్లా ఐటీ అధికారి



రవికుమార్, భైంసా, తహసీల్దార్
అతిక్ ఉద్దీన్, కుభీర్, తహసీల్దార్
శ్రీదేవి, సారంగాపూర్, తహసీల్దార్
సరిత, దిలావర్పూర్, తహసీల్దార్
శ్రీనివాసరావు, సూపరింటెండెంట్
ఆర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్
నరేష్, డ్రైవర్, కలెక్టరేట్
నైలు, సీఐ, భైంసారూరల్
మల్లేష్, సీసీఎస్, సీఐ
రాధిక, కానిస్టేబుల్, ఎస్పీ కార్యాలయం



ప్రవీణ్, సర్వేయర్
ఎండి షాహిద్ అహ్మద్, జూనియర్ అసిస్టెంట్, జెడ్పీ ఆఫీస్
డాక్టర్ సునీల్‌కుమార్, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్
గణేష్, ఆర్ఎంవో, జిల్లా జనరల్ ఆస్పత్రి
డాక్టర్ వాసు, అసిస్టెంట్ ప్రొఫెసర్, పీడియాట్రిక్ విభాగం
జి వనిత, స్టాఫ్ నర్సు, జిల్లా జనరల్ ఆస్పత్రి
డి.లత, ఏఎస్‌డబ్ల్యూవో, నిర్మల్
శ్రీదేవి, సీనియర్ అసిస్టెంట్, జిల్లా రవాణాశాఖ
సీహెచ్ దీపారాణి, రవాణా శాఖ కానిస్టేబుల్
నాగమణి, సీడీపీవో



నాగరాజు
రంజిత్
శ్రీకాంత్
శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్, కలెక్టర్ ఆఫీస్
సౌమ్య, మెడికల్ ఆఫీసర్, ముజిగి పీహెచ్‌సీ
ఎం.చరణ్‌రెడ్డి, హార్టికల్చర్ ఆఫీస్
రాజు, లెక్చరర్, డిగ్రీ కళాశాల
షెఫాలి, స్టెనోగ్రాఫర్, ఖానాపూర్ జూనియర్ సివిల్ కోర్టు
వామన్, కంప్యూటర్ ఆపరేటర్, ఐకేపీ, భైంసా
మధుసూదన్‌రెడ్డి, ఐసీడీఎస్

ట్రిపుల్‌ఐటీలో గణతంత్ర వేడుకలు



ట్రిపుల్‌ఐటీలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో శుక్రవారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. శాతవాహన గ్రౌండ్‌లో వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనం ద్వారా నిర్మితమైన మన విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పూర్తిస్థాయిలో కృషిచేస్తున్నామన్నారు. గడిచిన ఏడాదిన్నర కాలంలో రూ. 100 కోట్లమేర ఖర్చుపెట్టామని, రానున్న విద్యాసంవత్సరానికి కావాల్సిన వాటి కోసం ప్రణాళిక వేస్తున్నామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూనే ఉపాధి అవకాశాల్లో నైపుణ్యాలు సాధించే దిశగా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అధ్యాపకులు ఉద్యోగుల సమన్వయంతో ట్రిపుల్‌ఐటీని అగ్రభాగన నిలిపేందుకు కృషిచేస్తామన్నారు. అంతకు ముందు ఆర్జీయూకేటీ ఎన్‌సీసీ వలంటీర్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులు చేసిన కవాతు అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ సతీశ్‌కుమార్ పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ

గిరిజనుల అభివృద్ధికి నిరంతర కృషి

- ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా
- ఐటీడీఏలో ఘనంగా గణతంత్ర వేడుకలు

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధీనంలోని గిరిజన ప్రాంతాల సంపూర్ణ అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా కృషి చేస్తున్నామని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బు గుప్తా అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం ఐటీడీఏ ప్రాంగణంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయిలతో కలిసి జెండా ఎగురవేశారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ విద్యాభివృద్ధికి 917 ప్రాథమిక పాఠశాలల్లో 12,945 విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, 681 ఉపాధ్యాయులు పనిస్తున్నారన్నారు. 133 ఆశ్రమ పాఠశాలల్లో 34,658 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారన్నారు. 13,656 విద్యార్థులకు రూ.1134.96 లక్షలు పోస్టుమెట్రిక్ స్కాలర్ షిప్, 553 విద్యార్థులకు రూ.8.45 లక్షలు ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ మంజూరు చేసినట్లు తెలిపారు. 72 పీవీటీజీ గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనా, మోడల్ పాఠశాలలుగా రూపకల్పన చేయడం జరిగిందన్నారు. క్రీడల్లో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే విధంగా కావాలిసిన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. 59 నెలల తీవ్ర పోషణ లోపం ఉన్న పిల్లల ఆరోగ్యం మెరుగుపర్చడం కోసం బాలామృతం పంపిణీ చేసేందుకు కొమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలలో పైలెట్ ప్రాజెక్ట్ ప్రారంభించినట్లు తెలిపారు. వైద్యం కోసం అదనపు జిల్లా, ఆరోగ్య శాఖాధికారి పరిధిలో 32ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 186 ఉప ఆరోగ్య కేంద్రాలు, ఆరు సామాజిక ఆరోగ్య కేంద్రాల ద్వారా వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. ఐటీడీఏ ఉట్నూర్ పరిధిలో 23 మండలాల్లో 24 పీహెచ్‌సీలలో అవ్వల్ అంబులెన్స్‌ల ద్వారా 31523 మంది గర్భవతులకు సురక్షిత ప్రసవం చేయడం జరిగిందన్నారు. ఆర్థిక సహాయం కింద ఉమ్మడి జిల్లాకు రూ. 44.67 కోట్ల సబ్సిడీతో 5644 యూనిట్లు మంజూరు చేశామని, 4378 మంది లబ్ధిదారుల ఎంపిక పూర్తియిందన్నారు. 2160 మందికి సబ్సిడీ కింద రూ.20.25 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగం ద్వారా మౌలిక సదుపాయాల కోసం 423 తారురోడ్ల నిర్మాణాలకు రూ.52161 లక్షల అంచనాలతో మంజూరైన కొన్ని పనులు పురోగతిలో ఉన్నాయని, అందుకు రూ.462.14 లక్షలు ఖర్చు అయ్యాయని మిగిలిన ప్రారంభించడం జరుగుతుందన్నారు. పర్యటకం కోసం కుంటాల జలపాం, సప్తగుండాల జలపాతం, ఉట్నూర్ కోటలో ఈకో టూరిజం ప్రాజెక్టు క్రింద రూ.900 లక్షలతో పనులు మంజూరైనట్లు తెలిపారు. గిరిజన సహకార సంస్థ, ఐటీడీఏ ఉట్నూర్ ఆధ్వర్యంలో 17 పెట్రోల్ పంపులు ఏర్పాటు కోసం ప్రతిపాదనలు రూపొందించామని, 9 పెట్రోల్ పంపులు ఏర్పాటు చేసి నిరుద్యోగ గిరిజన యువతకు ఉపాధి కల్పించామని తెలిపారు. అంతకు ముందు విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. 87మంది ఉత్తమ ఉద్యోగులకు, సిబ్బందికి, ఐదు పాఠశాలలకు ప్రశంస పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఏవో రాంబాబు, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో బాలు, బీఏడ్ ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, ఈఈ భీంరావు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో



సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

వలస కార్మికుల సమస్యలపై అధ్యయనం..



కార్మిక సంఘ నాయకులతో బృందం సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవాసీ విధానం (ఎన్నారై పాలసీ), గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడానికి, గల్ఫ్ దేశాల్లో వలస కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై అధ్యయనం చేయడానికి రాష్ట్రం నుంచి కార్మిక సంఘాల నాయకులు, కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ విభాగం నాయకులతో కూడిన బృందం శుక్రవారం యూఏఈ పర్యటనకు బయలుదేరి వెళ్లింది. శని, ఆదివారాల్లో రాష్ట్రం నుంచి వెళ్లిన గల్ఫ్ కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకోనున్నారు. బృందంలో నిర్మల్ జిల్లాకు చెందిన ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల, సారంగాపూర్ మండల జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, టీపీసీసీ ఎన్ఆర్ఐ విభాగం చైర్మన్ బి.ఎం. వినోద్ కుమార్, గల్ఫ్ ఎన్నారై సెల్ కన్వీనర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జెలాల సైదయ్య బాబు ఉన్నారు. వీరితోపాటు ఏమిగ్రెంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు, వలస కార్మికుల సమస్యల విశ్లేషకులు మంద భీమ్‌రెడ్డి పాల్గొననున్నారు. దుబాయ్, షార్జా, అబుదాబి తదితర ప్రాంతాల్లోని వలస కార్మికుల క్యాంపుల్లో బసచేసి సమస్యలను తెలుసుకుని నివేదిక తయారు చేయనున్నారు. గత శాసనసభ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ గల్ఫ్ కార్మిక సంక్షేమం కోసం ఎన్నారై పాలసీని రూపొందించనున్నట్లు ఇచ్చిన హామీ మేరకు ఈ పర్యటన కొనసాగుతుందని పరికిపండ్ల తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ముజాహిద్ వివరాల ప్రకారం... ఇందిరమ్మ కాలనీ సమీపంలోని సేవాదాస్ నగర్‌కు చెందిన హేరకుమ్ర సాయిపృథ్వి (24) తన సోదరుడితో నివాసం ఉంటున్నారు. తల్లి తిర్యాణిలో టీచర్‌గా ఉద్యోగం చేస్తోంది. సాయిపృథ్వి గతంలో ఉక్రెయిన్‌లో ఎంబీబీఎస్ అడ్మిషన్ పొందాడు. అప్పట్లో అక్కడ యుద్ధం కారణంగా ఇంటికి తిరిగి వచ్చాడు. ఎంబీబీఎస్‌లో సీటు రాకపోవడంతో బీఎస్సీలో అడ్మిషన్ తీసుకున్నాడు. అప్పటి నుంచి మనోవేదనకు గురవుతున్న ఆయన ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

జాతీయ జెండాకు అవమానం...



మధ్యాహ్నమే దింపేసిన జాతీయ జెండా

కడెం: గణతంత్ర దినోవ్సవ వేడుకలో సందర్భంగా జాతీయ జెండాకు కడెం మండలంలో అవమానం జరిగింది. వివరాల్లోకి వెలితే.. మండలంలోని బెల్లాల్ క్లస్టర్ పరిధిలోని పెద్ద బెల్లాల్ వ్యవసాయ విస్తరణ అధికారి దాసరి శాలిని రైతు వేదిక వద్ద ఉదయం 9గంటల 30నిమిషాలకు జెండాను ఆవిష్కరించారు. మధ్యాహ్నం 2గంటలకే జెండాను కిందికి దింపేసి జెండాను కర్రాను సైతం తీసివేశారు. నిబంధన ప్రకారం సాయంత్రం 5గంటలకు జెండాను దించాలి. కానీ ఏఈవో మాత్రం 2గంటలకే దించి వెళ్లిపోయారు. దీనిపై ఏఈవో శాలిని వివరణ కోరగా.. జెండా దింపే పనిని మా పని వాళ్లకు అప్పగించినట్లు తెలిపారు. మండల వ్యవసాయ అధికారిని వివరణ కోరగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. జాతీయ జెండాను అవమానించిన ఏఈవోపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఐడియా అదిరింది..



లక్ష్మణచాంద మండలంలో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ఒకేసారి అటు వరినాట్లు... ఇటు పసుపు తవ్వకం పనులు కొనసాగుతున్నాయి. దీంతో మండలంలోని పీచర గ్రామానికి చెందిన భూమేశ్ తన పొలంలో వరినాటు కోసం కూలీలను పీచర గ్రామం నుంచి పొలం వరకు తన ట్రాక్టర్‌కు వెనుక ఎడ్ల బండిని తగిలించి అందులో కూలీలను తీసుకొచ్చాడు. దీనిని చూసిన పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

– లక్ష్మణచాంద

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ఎదులాపురం: రోడ్డు ప్రమాదంలో యువకుడు గురువారం రాత్రి మృతిచెందాడు. టూ టౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు వివరాల ప్రకారం... మహారాష్ట్ర నాందేడ్ జిల్లా మాహూర్ తాలుకా అసోలి గ్రామానికి చెందిన రాథోడ్ అమిత్ (22), రాథోడ్ గణేశ్‌లు అదే గ్రామానికి చెందిన రాథోడ్ ప్రఫుల్ ఆటోలో తాంసి మండలం బండల్‌నాగపూర్ గ్రామానికి గురువారం రాత్రి సరుకుల కోసం వచ్చారు. రాత్రి 11గంటల ప్రాంతంలో అసోలికి బయలు దేరారు. జమునానగర్ ప్రాంతంలో ఆటో బోల్తా పడగా అమిత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మాండ్వి ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తీసుకురాగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.